క్లుప్తంగా

థియేటర్‌లో ప్రదర్శనల నిలిపివేత

- టిక్కెట్ల అధిక ధరలపై ఆర్డీవో చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

అమలాపురం టౌన్: పట్టణంలోని వెంకటరమణ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న సినిమాకు టిక్కెట్ ధరలను అధికంగా వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలపై ఆర్డీవో కొత్త మాధవి, తహసీల్దార్ పి.అశోక్ ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ థియేటర్‌ను సందర్శించి, అధిక ధరలతో టిక్కెట్లు విక్రయిస్తున్న విషయాన్ని స్వయంగా గమనించారు. ఆర్డీవో, తహసీల్దారు ఈ థియేటర్ టిక్కెట్ల అమ్మకాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. థియేటర్‌లో శానిటేషన్ పరిస్థితులను కూడా పరిశీలించారు. రూ.110 తీసుకోవాల్సిన టిక్కెట్ ధరను రూ.150, రూ. 70 తీసుకోవాల్సిన టిక్కెట్ ధరను రూ.100 వసూలు చేస్తున్నట్లు వారు గుర్తించారు. దీంతో మంగళవారం ఆ థియేటర్‌లో నిర్వహించాల్సిన ప్రదర్శనలను నిలిపివేస్తూ ఆర్డీవో ఆదేశాలు ఇచ్చారు.

ఏప్రిల్ 2న పాలిసెట్‌లో శిక్షణ

అమలాపురం రూరల్: భట్లపాలెంలోని బీవీసీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ రెండో తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు ఉచిత పాలిసెట్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ ఫణిశంకర్ మంగళవారం ఇక్కడ తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన అధ్యాపకులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని చెప్పారు. టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు

అమలాపురం టౌన్: పట్టణంలోని పదో వార్డులో ఉన్న విత్తనాలవారిపాలెం శివారు భారతి గార్డెన్స్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత ప్రజలు వార్డు కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయికి మంగళవారం విన్నవించారు. కౌన్సిలర్ ఆ ప్రాంతంలో పర్యటించి, సమస్యను వీక్షించారు. తమ ప్రాంతంలో డ్రైనేజీ సౌకర్యం లేక దోమల ఉధృతితో పాటు, పందులూ స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు వాపోయారు. ప్రజలు తరచూ వైరల్ జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నట్లు చెప్పారు. త్వరలోనే ఈ ప్రాంతంలో డ్రైనేజీని నిర్మించి, సమస్యను పరిష్కరిస్తామని కౌన్సిలర్ దుర్గాబాయి హామీ ఇచ్చారు. జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, స్థానికులు ఆమె వెంట ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ముమ్మిడివరం: జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అయినాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 30 మంది విద్యార్థులకు కళ్లద్దాలను సర్పంచ్ మోకా రామారావు అందజేశారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా.హేమలత, ఎస్.సత్తిబాబు, హెచ్ఎం టీవీ కృష్ణారెడ్డి, పి.లక్ష్మిప్రియ పాల్గొన్నారు.

ఆ నివేదిక తప్పుల తడక

ఐ.పోలవరం: రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక పూర్తిగా తప్పుల తడక అని, ఇది ఏకపక్షంగా ఇచ్చిన నివేదిక అని మాల మహానాడు మండల శాఖ ఆరోపించింది. సంఘ మండల శాఖ అత్యవసర సమావేశం పాత ఇంజరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం జరిగింది. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం అన్యాయమని, దీనికి రాష్ట్ర ప్రభుత్వాలు వంతపాడుతున్నాయని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఉద్యమానికి కార్యాచరణ సిద్ధం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు వడ్డి గౌతమ్, నాగాబత్తుల రామకృష్ణ, కాశి పరివాజ్ కుమార్, సాధనాల బాబూరావు పాల్గొన్నారు.

నేత్రదానం


వెంకటరెడ్డి(ఫైల్)

తాళ్లరేవు: పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామానికి చెందిన దున్నా చిన్న వెంకటరెడ్డి(59) మంగళవారం తెల్లవారుజామున మరణించారు. సామాజిక కార్యకర్త డి.వెంకటరమణ అతని భార్య, కుమారులకు నేత్రదానంపై అవగాహన కల్పించి, వెంకటరెడ్డి కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ-బ్యాంకుకు దానం చేయించారు. ఐ-బ్యాంకు సిబ్బంది కార్నియాలు సేకరించారు.

'కోర్టు' చిత్ర బృందం సందడి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రియదర్శి

తాళ్లరేవు: కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాలలో 'కోర్టు' చిత్ర బృందం సందడి చేసింది. మంగళవారం చిత్రంలోని ప్రధాన పాత్రదారులు ప్రియదర్శి, హర్షరోషన్, కాకినాడకు చెందిన ఆపళ్ల శ్రీదేవి తదితరులు సందడి చేశారు. చిత్రంలోని పలు డైలాగ్‌లను చెప్పి విద్యార్థులను అలరించారు. చిత్రంలో పలు ఆసక్తికర సన్నివేశాలను ప్రియదర్శి వివరించారు. ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు. ఈ సందర్భంగా నటులతో సెల్ఫీలు దిగేందుకు యువత ఎగబడ్డారు.


జంతు, వృక్ష జాతుల విశేషాలు తెలిపేలా బోర్డులు


ప్రత్యేక ఆకర్షణగా వివిధ రకాల బొమ్మలు


కోరంగి అభయారణ్యం స్వాగత ద్వారం వద్ద పర్యాటకుల సందడి

ప్రకృతి ఒడి.. అందాల ఒరవడి

- మడ అడవుల్లో పర్యాటకుల సందడి
- పర్యాటక ప్రదేశాలకు అదనపు హంగులు
- వేసవి సెలవుల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- అలరించనున్న బోటు షికార్

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోరంగి అభయారణ్యం వేసవి సందడికి ముస్తాబవుతోంది. ఏటా వేసవి తాపం నుంచి ఉపశమనం, ఆహ్లాదం పొందేందుకు అధిక శాతం మంది అభయారణ్యానికి వస్తుంటారు. ప్రకృతి ఒడిలో చిన్నా, పెద్దా తేడా లేకుండా ఆటపాటలతో సరదాగా గడిపే క్షణాలకు అభయారణ్యం వేదిక కాబోతుంది. సందర్శకులను మరింత ఆకర్షించడంతో పాటు, వినోదాన్ని పంచేవిధంగా అటవీ శాఖ మరిన్ని ఏర్పాట్లు చేస్తోంది. వేసవిలో పెరగనున్న సందర్శకుల కోసం అదనపు హంగులు దిద్దుతున్నారు. ప్రత్యేక సౌకర్యాలతో, పర్యాటక ప్రాముఖ్యాన్ని తెలియజేసేలా రంగులు వేస్తూ, సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఇంటర్ పరీక్షలు పూర్తికావడం, త్వరలో పదో తరగతి, ఇతర పరీక్షలు పూర్తి కానున్న నేపథ్యంలో అభయారణ్యానికి సందర్శకుల తాకిడి అధికమవుతుంది.

ప్రత్యేక చర్యలు

పర్యాటకులు సరదాగా గడిపేందుకు అటవీ శాఖ ఇక్కడ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఏటా జిల్లా నలుమూలల నుంచే కాకుండా, వివిధ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. ప్రకృతి ఒడిలో మడ చెట్ల నడుమ చల్లటి ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉల్లాసంగా గడపడం పర్యాటకులకు మరచిపోలేని అనుభూతినిస్తుంది. సందర్శకుల కోసం తాగునీరు, తినుబండారాలు, శీతల పానీయాల దుకాణాలను కూడా ఏర్పాటు చేసింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు అభయారణ్యంలో విశేషాలను తెలియజేసే మినీ థియేటర్, మత్స్య, పక్షిజాతులను వీక్షించేలా ఆక్వేరియం, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునే విధంగా ప్రకృతి స్టాళ్లను ఏర్పాటు చేశారు.


ఉర్రూతలూగించే బోటు షికార్

బోటు షికార్.. క్రీక్ విజిట్లు

పర్యాటకులకు బోటు షికార్ ప్రత్యేక అనుభూతినిస్తుంది. ఏపీ టూరిజం, అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ బోట్లపై గోదావరి పాయలో ప్రయాణించి సముద్రం కలిసే ప్రాంతానికి తీసుకువెళతారు. అక్కడ నుంచి మడ అడవుల అందాలతో పాటు, కాకినాడ సిటీ అందాలు పర్యాటకులను అలరిస్తాయి. మడ చెట్లపై సంచరించే వివిధ రకాల పక్షులు, జంతువులు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటాయి. కేరళ తరహాలో మడ అడవుల్లో ఉండే చిన్నపాటి క్రీకు(పిల్ల కాలువలు)ల్లో పర్యాటకులు బోట్లపై సందర్శించేవిధంగా క్రీక్ విజిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.


రంగులు వేస్తున్న కళాకారులు

సందర్శకుల కోసం ఏర్పాట్లు



వేసవిలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అభయారణ్యాన్ని సందర్శించే పర్యాటకులకు మరింత ఆనందాన్ని అందించేందుకు అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రకృతి అందాలతో పాటు, ఇక్కడ విశేషాలను అందరికీ తెలిసేవిధంగా మినీ థియేటర్, ప్రకృతి ప్రేమికుల కోసం అక్వేరియం, ప్రకృతి స్టాళ్ల ఏర్పాటు చేశాం. చిన్నారుల ఆటపాటల కోసం అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేసి, అభయారణ్యాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాం.

– సిద్ధార్థ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, కోరంగి అభయారణ్యం

సురక్షితంగా బోటు షికార్



సందర్శకులు, పర్యాటకులను ఆకర్షించేలా అభయారణ్యాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నాం. పిల్లలను ఆకట్టుకునేలా బొమ్మలు ఏర్పాటు చేసి, రంగురంగులతో సిద్ధం చేస్తున్నాం. పాడైన చెక్క వంతెనల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నాం. గోదావరిలో సురక్షిత బోటు షికార్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. లైఫ్ జాకెట్ వేసుకున్న వారిని మాత్రమే బోటు షికారుకు అనుమతిస్తాం. పోర్టు అధికారుల అనుమతులు, నిబంధనల మేరకు బోటు షికార్ నిర్వహిస్తున్నాం. ఇది మంచి అనుభూతినిస్తుంది.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజర్, కోరంగి అభయారణ్యం

చెస్‌లో విద్యార్థులకు బహుమతులు


బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: రామచంద్రపురంలో పీకే చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో స్థానిక విద్యానిధి స్కూలుకు చెందిన ఆరుగురు విద్యార్థులు నగదు బహుమతులు గెలుచుకున్నారు. గ్రేడ్-8ను విద్యార్థి టి.వెంకటేష్ గెలుచుకున్నాడు. ట్రోఫీతో పాటు రూ.వెయ్యి నగదు బహుమతి సాధించాడు. గ్రేడ్-9ను ఎన్.సంతోష్ గెలిచి, రూ.650 నగదు బహుమతి, గ్రేడ్-9ను బి.నానిబాబు గెలిచి, రూ.500 నగదు బహుమతి, గ్రేడ్-8లో పి.ధరణి ట్రోఫీ సాధించాడు. గ్రేడ్-7లో బి.సూరత్ వెస్లీ, గ్రేడ్-6లో బి.జాన్ బ్లెస్సీ ట్రోఫీలను గెలుచుకున్నారు.

అమలాపురం రూరల్: రామచంద్రపురంలో జరిగిన కోనసీమ జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో అమలాపురం మండలం సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. బాలికల అండర్-15లో గుత్తుల వైష్ణవి ప్రథమం, బాలుర అండర్-7లో వి.కుషాల్ మొదటి, బాలికల్లో బి.శాన్వి ద్వితీయ స్థానాలు పొందారు.

విద్యార్థులకు క్షేత్ర స్థాయి శిక్షణ

అమలాపురం రూరల్: కాకినాడ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ విద్యార్థులకు నాన్ రెసిడెన్షియల్ ఫీల్డ్ ఇన్ఫర్మేషన్ శిక్షణ కార్యక్రమం అమలాపురం మండలం బండారులంక పంచాయతీలో మంగళవారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో స్వయంశక్తి సంఘాల్లోని మహిళలు చేస్తున్న ఆర్థిక కార్యకలాపాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉండ్రు బాబ్జిరాజు మాట్లాడుతూ, గ్రామీణ మహిళలు బ్యాంకుల రుణ సదుపాయంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారన్నారు. కోనసీమలోని మహిళా సంఘాలు రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచాయని వివరించారు. పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఏపీఎం పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఆర్డీవో సమీక్ష


సమీక్షలో పాల్గొన్న అధికారులు, నాయకులు

అమలాపురం టౌన్: నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలు, పేర్లు, బూత్‌లు తదితర అంశాలపై ఆర్డీవో, ఎన్నికల అధికారి కొత్త మాధవి స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, వివిధ పార్టీల నాయకులతో మంగళవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో పేర్ల మార్పు, బూత్ మార్పు వంటి సవరణలకు సంబంధిత ఫారాలను సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్నికల నిర్వహణ పరంగా ప్రాంతాలు, బూత్‌లపై ఆర్డీవోకు విజ్ఞప్తులు చేశారు. పట్టణానికి చెందిన 1,632 లబ్ధిదారులకు అల్లవరం మండలం బోడసకుర్రు టిడ్కో అపార్ట్‌మెంట్లలో ఇళ్లు ఇచ్చారని, ఎన్నికల సమయంలో వారు అమలాపురం వచ్చి ఓట్లు వేయాల్సి ఉంటుందని చెప్పారు. టిడ్కో అపార్ట్‌మెంట్ల వద్దే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. మండలం మారుతున్నందున ఈ ప్రతిపాదన సాధ్యం కాదని ఆర్డీవో స్పష్టం చేశారు. పలు బూత్‌ల్లో ఒకే కుటుంబానికి చెందిన వారి ఓట్లు ఉండడం వల్ల ఎన్నికల సమయంలో వారికి ఇబ్బంది ఎదురవుతోందని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పరిశీలన చేస్తామని ఆర్డీవో చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, అమలాపురం, ఉప్పలగుప్తం తహసీల్దార్లు పి.అశోక్ ప్రసాద్, వీఎస్ దివాకర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పశు పోషణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఉప్పలగుప్తం: రైతులు పశు పోషణలో ప్రత్యేక శ్రద్ధ చూపించి, సీజనల్, అంటు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ బి.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వానపల్లిపాలెం గ్రామంలో గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాల ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాలికుంటు వ్యాధితో పశువులు దీర్ఘకాలం రోగాల బారినపడతాయని, పాల దిగుబడి తగ్గి రైతు నష్టపోతున్నాడని వివరించారు. దీనిని నియంత్రించడానికి ఏటా రెండు దఫాలు పశువులకు టీకాలను అందించి, వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించే చర్యలు చేపట్టామని వివరించారు. గ్రామంలో 154 పశువులకు టీకాలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో జేవీవో కేవీ రామారావు, సహాయకులు కొల్లు కిషోర్, సూదా రాజేష్, గోపాలమిత్ర నిమ్మకాయల శ్రీకృష్ణార్జునుడు పాల్గొన్నారు.


వానపల్లిపాలెంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించాలి

యానాం: పట్టణ పరిధిలో చెత్తను వేయడానికి వీలుగా డంపింగ్ యార్డుకు స్థలాన్ని కేటాయించి, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం పుదుచ్చేరి ఎల్ఏడీ డైరెక్టర్ శక్తివేలును ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. పుదుచ్చేరి ఎల్ఏడీ శాఖ కార్యాలయంలో శక్తివేలుతో సమస్య తీవ్రతను వివరించారు. కనకాలపేట డంపింగ్ యార్డును గ్రామస్తుల ఆందోళన మేరకు ఇటీవల నిలిపివేశామని, కొత్తగా స్థలం కేటాయించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ, నెల రోజులు సమయమిస్తే, స్థలాన్ని చూపిస్తామని, అప్పటివరకు కనకాలపేట డంపింగ్ యార్డును కొంతకాలం కొనసాగించాలని శక్తివేలు తనను కోరారని తెలిపారు.

గ్రామస్తుల ధర్నా

కనకాలపేట డంపింగ్ యార్డులో మళ్లీ చెత్తను వేయనిచ్చే ప్రసక్తే లేదని గ్రామస్తులు స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి భీమ్‌నగర్, యూకేవీ నగర్, కనకాలపేట తదితర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు రామాలయం వద్ద సమావేశమై, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా తీర్మానించారు. అనంతరం డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. చెత్తను డంపింగ్ యార్డు వద్దకు తరలిస్తే తీవ్రంగా అడ్డుకుంటామన్నారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.


ధర్నా చేస్తున్న గ్రామస్తులు

డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలి

అమలాపురం రూరల్: వాహనాలు నడిపే డ్రైవర్లు తమ రికార్డులు సక్రమంగా ఉంచుకుని, నిబంధనలు పాటించాలని అమలాపురం ఎంవీఐ కేఆర్ రవికుమార్ అన్నారు. అమలాపురం రథసారథి యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్యానందం ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురం లారీ ఆఫీసు వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ డి.కాశీవిశ్వేశ్వరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. డ్రైవర్లకు యూనియన్ ఐడీ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఎంవీఐ, ఏఎంవీఐలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు దంగేటి దుర్గాప్రసాద్, మంద దుర్గారావు, నక్కా రాజేష్, నరసింహస్వామి, కడలి జగదీష్, పాములూరి చందు, గెద్దం శ్రీరామ్‌కుమార్, జంగా వెంకటేష్ పాల్గొన్నారు.


ఎంవీఐ, ఏఎంవీఐలను సత్కరిస్తున్న యూనియన్ నాయకులు

రహదారిపై మురుగుతో అవస్థలు



సుంకరపాలెం జంక్షన్ వద్ద రహదారిపై పారుతున్న మురుగు నీరు

తాళ్లరేవు: జాతీయ రహదారి-216 నుంచి ద్రాక్షారామ రహదారికి వెళ్లే సుంకరపాలెం జంక్షన్‌లో మురుగునీరు రహదారిపై పారుతుండడంతో ప్రయాణికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. హైవే డ్రైనేజీ నుంచి మురుగు నీరు పైకి ఉబికి రహదారిపై చేరుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్రాక్షారామ, ఇంజరం తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు అదే ప్రాంతంలో బస్సులు, ఆటోల కోసం వేచి చూస్తారు. ఈ ప్రాంతంలో పలు విద్యాసంస్థలు ఉండడంతో నిత్యం అనేక మంది విద్యార్థులు సంచరిస్తుంటారు. మురుగు కారణంగా వ్యాపారాలు సాగడం లేదని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అడ్డగోలు అనుమతులపై అభ్యంతరం

- నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన 5 పనులు రద్దు
- ఇంజినీర్ల పనితీరుపై కౌన్సిల్ ధ్వజం
- ట్రాక్టర్ల నిర్వహణ, పారిశుధ్య పర్యవేక్షణ లోపాలపై సభ్యుల ఆగ్రహం

అమలాపురం టౌన్: అత్యవసరం ముసుగులో అడ్డగోలుగా చేపట్టిన పలు పనులపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాలకపక్ష కౌన్సిలర్లు కమిషనర్, ఇంజినీర్లను నిలదీశారు. అప్పటికే పూర్తి చేసి, కౌన్సిల్ ఆమోదం కోసం అజెండాలో చేర్చిన ఐదు పనుల టెండర్లను రద్దు చేసి ఇంజినీర్లు చేసిన తప్పులను వారు ఎండగట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశం ముఖ్యంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వ్యవస్థలోని లోపాలను పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రస్తావించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సైతం ఇంజినీర్ల పనితీరుపై ధ్వజమెత్తారు. పట్టణంలో పలుచోట్ల పలువురు దుకాణదారులు తమ దుకాణాలకు ఎదురుగా డ్రైన్లపై సీసీ శ్లాబ్‌లు వేసి, దోమల ఉధృతికి, డ్రైన్ల నిర్వహణ లేకుండా కారకులవుతున్నారని ఆరోపించారు. డ్రైన్లపై ఐరన్ గ్రిల్‌లు ఏర్పాటు చేసుకోవాలే తప్ప ఇలా సీసీ శ్లాబ్‌లతో మూసివేయడం సరికాదని హితవు పలికారు. స్పెషల్ డ్రైవ్‌తో అలాంటి డ్రైన్లను గుర్తించి, ధ్వంసం చేయాలని కమిషనర్‌కు ఎమ్మెల్సీ సూచించారు.


సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

కౌన్సిల్‌పై నెట్టేస్తారా?

పలువురి ఒత్తిళ్లతో ముందే పనులు పూర్తి చేసి, వాటికి ఇప్పుడు టెండర్లు పిలిచి ఆ అంశాలను ఆమోదించాలని కౌన్సిల్‌పైకి నెట్టేస్తారా అంటూ పాలకపక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని డీఈఈ సీహెచ్ నాగసతీష్‌ను ప్రశ్నించారు. ఇలా పనులు చేసి ఇప్పుడు తీరిగ్గా కౌన్సిల్ ఆమోదం కోరడం సమంజసమేనా?, అసలు ఇందులో ఉన్న నిబంధనలు ఏమిటని నిలదీశారు. అజెండాలో 116 నుంచి 120వ అంశం వరకూ అంటే ఐదు పనులను కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు. కమిషనర్, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు ముందే అనుకున్నా లేదా చైర్‌పర్సన్ రాటిఫికేషన్ చేసినా సరిపోతుంది, ఇందులో ఏదీ చేయకుండా కౌన్సిల్‌పై రద్దడం సరికాదని హితవు పలికారు. దీనికి కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, డీఈఈ నాగసతీష్ ఇలాంటి తప్పిదం మరోసారి జరగకుండా చూసుకుంటామని సమావేశానికి సంజాయిషీ ఇచ్చారు. ప్రతిపక్ష నాయకుడు ఏడిద శ్రీను మొదటి తప్పుగా భావించి ఆ అంశాలను ఆమోదిద్దామని సూచించారు. చివరకు పాలకపక్షం ఈ ఐదు అడ్డగోలు అంశాలైన అభివృద్ధి పనుల టెండర్లను రద్దు చేసింది.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ట్రాక్టర్ల రిపేర్లపై నిలదీత

మున్సిపాలిటీలో చెత్తను తరలించే ట్రాక్టర్లకు తరచూ రిపేర్లు అంటూ రూ.లక్షల్లో పెడుతున్న బిల్లుల ఆమోదం వచ్చేసరికి కౌన్సిల్‌లో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఇంజినీర్లను నిలదీశారు. పారిశుధ్యాన్ని పర్యవేక్షించే ఇంజినీర్ వెంకటేష్ ఇచ్చిన వివరణపై కౌన్సిలర్లు సంతృప్తి చెందలేదు. పాలకపక్ష కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము, చిట్టూరి పెదబాబు, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఏడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, తిక్కా సత్యలక్ష్మి మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. రిపేర్ల పేరుతో మున్సిపాలిటీ రూ.లక్షల్లో కోల్పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త పన్ను వసూళ్లను నిలిపేయడం, ఇంటింటా చెత్తను తరలించే టిప్పర్ల డ్రైవర్లు సమ్మెలో ఉండడం వల్లే పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని పాలకపక్ష కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ల రిపేర్లకు ఓ సివిల్ కాంట్రాక్టర్ పేరును అజెండాలో చేర్చడంపై అభ్యంతరం చెప్పారు. సివిల్ కాంట్రాక్టర్‌కు ట్రాక్టర్ల రిపేర్లతో ఏం సంబంధం ఉందని నిలదీశారు. ట్రాక్టర్లు రిపేర్లు చేసే ఆటోమొబైల్ సంస్థ లేదా మెకానిక్‌లతో రిపేర్లు చేయించాలే తప్ప ఇలా సివిల్ కాంట్రాక్టర్ పేరు పెట్టడంలో ఆంతర్యమేమిటని కౌన్సిలర్లు మండిపడ్డారు.

ఎలక్ట్రికల్ కాంట్రాక్టులపైనా..

అజెండాలోని 110, 111 అంశాలతో ఉన్న వీధి లైట్ల నిర్వహణకు ఎలక్ట్రికల్ టెండర్లపై సైతం కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. ఈ టెండర్లలో 30 నుంచి 35 శాతం తక్కువ ధరలతో ఓ కాంట్రాక్టర్ పలు టెండర్లు వేయడంపై కౌన్సిలర్ బులినాని ఇంజినీర్లను ప్రశ్నించారు. 30 నుంచి 35 శాతం తక్కువ ధరలకు టెండర్లు వేస్తే, ఆ కాంట్రాక్టర్ పనులేమి చేస్తాడని సందేహం వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డులో రూ.లక్షలతో ఇటీవల వీధి లైట్లు వేసినప్పటికీ, అవి సరిగా వెలగడం లేదని కౌన్సిలర్ బండారు గోవిందు ఆరోపించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్ మాట్లాడుతూ అధికారులు మున్సిపల్ ఆదాయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తే ఇబ్బంది పడతారని హెచ్చరించారు.

వెనుకబడిన వారిపై దృష్టి పెట్టండి

ఐ.పోలవరం: చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి(సీఎంఓ) బీవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఏపీ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో భైరవపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాల(ఆలయం వద్ద), ఎంపీపీఎస్ పాఠశాల మెయిన్, ఎంపీపీఎస్ పాఠశాల తీర్థాల మొండి స్కూళ్లను ఎంఈఓ ఎస్.కొండారెడ్డితో కలిసి సందర్శించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పాఠశాలలో డ్రాపౌట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హెచ్ఎంలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. బోధనా పద్ధతులు, హాజరు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గోదారమ్మకు తిలకం


యానాం వద్ద గౌతమీ గోదావరి అందాలు

యానాం: యానాం వద్ద గలగలపారుతూ బంగాళాఖాతంలో గోదారమ్మ సంగమిస్తుంది. గౌతమీ గోదావరి నది మంగళవారం సాయంత్రం సంధ్యా సమయంలో అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించింది. స్థానిక రాజీవ్ రివర్ బీచ్ వద్ద నుంచి గోదారమ్మకు నుదుటిన తిలకం దిద్దినట్టు బంగారు రంగులో సందర్శకులకు కనువిందు చేసింది.